మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 84
పేజీలు : 3

సోమవారం
13.10.2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను

కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.

అనుభవం ఉన్న వారికే ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు. వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.

GSTIN:36FDKPS1308P1ZX

టీ-మీడియా
సామాజికం ... ప్రజల పక్షం...
epaper,www.tmedia.net.in










# గుట్టుగా మాదకద్రవ్యాల ఎంట్రీ

## ప్రవేశమార్గంగా ఆదిలాబాద్ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో అధ్యయనం

**టిమీడియా, అక్టోబర్ 12, హైదరాబాద్ బ్యూరో:**
విశాఖపట్నం నుంచి మహారాష్ట్రలోని సోలాపూర్ వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌లోని ఇద్దరు విద్యార్థినుల నుంచి రైల్వే పోలీసులు రూ.4.4 లక్షల విలువైన 17 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇస్రత్‌బానో(20), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కంచన్(21)గా గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో బానోతో పరిచయం పెంచుకున్న మాదకద్రవ్యాల స్మగ్లర్, వీరి ద్వారా గంజాయి రవాణా చేయిస్తున్నాడు. ఒక్కో ప్యాకెట్‌కు రూ.1,000 చొప్పున ఇస్తానని ఆశ చూపినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మరోసారి ఇదే ఎక్స్‌ప్రెస్‌లో 56.3 కిలోల గంజాయిని తరలిస్తూ పుణెకు చెందిన మొగల్ లక్ష్మణ్ అనే వ్యక్తి, ఇంకోసారి 10.6 కిలోలు తీసుకెళ్తూ ఒడిశాకు చెందిన కూలీలు అనంతరైత్, సురేశ్ చిక్కారు.

### స్మగ్లర్ల నెట్‌వర్క్ పని ఘటనలు

ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) నుంచి ఏకంగా 16 రాష్ట్రాలకు గంజాయిని ఇలా సరఫరా చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ నుంచి పలు మార్గాల ద్వారా తెలంగాణలోకి అవలీలగా తీసుకొస్తున్నారు. ముంబయి, గోవా, బెంగళూరుల నుంచి సింథటిక్ డ్రగ్స్‌ను గుట్టుగా రాష్ట్రంలోకి పంపిస్తున్నారు. అసలు డ్రగ్స్ నెట్‌వర్క్ ఎలా పని చేస్తోంది? రాష్ట్రంలోకి ఈ మత్తుదారులు ఎలా సాగుతున్నాయి? అనే అంశాలపై తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (ఈగల్) పోలీసులు సమగ్ర అధ్యయనంతో రిపోర్టును రూపొందించారు.

### రహస్య కంపార్ట్‌మెంట్లు

గంజాయిని ఒడిశాలోని మల్కాన్‌గిరి ఆంధ్ర%రి%ప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ట్రైజంక్షన్‌గా ఉన్న కుంట నుంచి తొలుత సీలేరు, చింతూరుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి భద్రాచలం ప్రాంతానికి తీసుకొస్తున్నారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి తుని, రాజమహేంద్రవరం, లంబసింగి, విజయవాడల మీదుగా ఖమ్మం, సూర్యాపేటల ద్వారా తెలంగాణలోకి తెస్తున్నారు. అనంతరం హైదరాబాద్ మీదుగా జహీరాబాద్‌ను దాటించి మహారాష్ట్రలోని ముంబయి, బీడ్, పుణె ప్రాంతాలకు కర్ణాటకలోని బీదర్ మీదుగా బాల్కి, ఔరాద్ ప్రాంతాలకు మత్తు పదార్థాలను పంపిస్తున్నారు. మరోపక్క హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల మీదుగా గోవాకు తరలిస్తున్నారు. 200 నుంచి 4 వేల కిలోల గంజాయి పరిమాణం పట్టేలా లారీలు, బొలెరోలు, లగ్జరీకార్లలో రహస్య కంపార్ట్‌మెంట్లు రూపొందించి జాతీయ రహదారి-16 మీదుగా తీసుకెళుతున్నారు. కొన్ని సందర్భాల్లో చెక్‌పోస్టుల్ని తప్పించుకునేందుకు సీలేరు నదిలో నుంచి రాత్రి సమయాల్లో పంపుతున్నారు. తక్కువగా తనిఖీలు ఉంటాయనే అంచనాతో రైళ్లలోని ఏసీ కోచ్‌లను స్మగ్లర్లు ఎంచుకుంటున్నారు. గంజాయిని సూట్‌కేస్‌లు, బ్యాగుల్లో దుస్తులు మధ్యలో కనపడకుండా సర్దుతూ సీట్ల కింద ఉంచుతున్నారు. ఇందుకోసం ఎక్కువగా కూలీలు, విద్యార్థులు, మహిళలను వినియోగిస్తున్నారు.

### జర్మనీ, మెక్సికోల నుంచి సింథటిక్ డ్రగ్స్

జర్మనీ, మెక్సికో తదితర దేశాల నుంచి నౌకల్లో కొకైన్, ఎండీఎంఏ, హెరాయిన్, ఎల్‌ఎస్‌డీ, ఎక్స్‌టసీ మాత్రలు, కెటమైన్, మెఫెడ్రోన్, ఆంఫెటమైన్ తదితర సింథటిక్ డ్రగ్స్‌ను తొలుత తమిళనాడు, కర్ణాటక, గోవా, మహారాష్ట్రల్లోని సముద్ర తీర ప్రాంతాలకు చేరుస్తున్నారు. నైజీరియన్ నెట్‌వర్క్ వాటిని హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా డిస్ట్రిబ్యూట్? చేస్తోంది. మాదక ద్రవ్యాలను చేరవేయడానికి స్మగ్లర్ల ముఠాలు ఎక్కువగా ప్రైవేట్ బస్సులు కొరియర్ సర్వీస్‌లను వినియోగించుకుంటున్నాయి. కేరళలో గత జనవరి, ఫిబ్రవరిల్లో 421 కిలోలు మాదకద్రవ్యాలు, ముంబయిలో రూ.250 కోట్ల విలువైనవి, శ్రీనగర్‌లో 220 బాటిళ్లలో కోడైన్ సిరప్, కోయంబత్తూర్‌లో విద్యార్థుల వద్ద సింథటిక్ ఓపియాడ్స్ ఇలా పార్శిళ్ల రూపంలో చేరుతున్న సమయంలోనే పోలీసు బృందాలు పట్టుకున్నాయి. డార్క్‌నెట్ ఫోరంలతో పాటు టెలిగ్రామ్, వికర్, వాట్సప్ లాంటి ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ సదుపాయం కలిగిన సోషల్? మీడియా ప్లాట్‌ఫాంలో మాదకద్రవ్యాల్ని ఆర్డర్ చేస్తున్నారు. అనంతరం పార్శిళ్లను డెడ్‌డ్రాప్ లొకేషన్ (నేరుగా అప్పగించకుండా ఒక ప్రాంతంలో పెడతారు)లో ఉంచి జీపీఎస్(గ్లోబల్? పొజిషనింగ్? సిస్టం) కోఆర్డినేట్స్‌ను సెల్‌ఫోన్లకు పంపిస్తున్నారు. నగదు చెల్లింపులను మాత్రం క్రిప్టోకరెన్సీ రూపంలో తీసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో హవాలా చేసే ఆపరేటర్లు డ్రగ్స్ సొమ్మును నైజీరియన్లకు ముట్టజెపుతున్నారు. హైదరాబాద్ నుంచి రావాల్సిన సొమ్మును గోవాలో వేరేవారికి అప్పగించేందుకు 2 శాతం చొప్పున కమీషన్ తీసుకుంటున్నారు. ఇటీవలే రూ.50 లక్షలను రెండ్రోజులలో ఇలా అప్పగించారు. అనంతరం నైజీరియన్ డీలర్లు 20 శాతం దాకా కమీషన్ తీసుకొని ఫారిన్ మనీ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా ఆఫ్రికా దేశాలకు పంపిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం రూ.55 లక్షలను ఇలా తరలించినట్లు ఈగల్ పోలీసుల దర్యాప్తులో తేటతెల్లమైంది.

### నల్లమందుకు ఆదిలాబాద్ ప్రవేశమార్గం :

ఓపియం(నల్లమందు) రాజస్థాన్ నుంచి తొలుత ఆదిలాబాద్‌లోకి అక్రమ మార్గాల్లో దిగుమతి అవుతోంది. నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి మీదుగా రాజధాని హైదరాబాద్ చేరుతోంది. ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్?లోని కొన్ని ప్రాంతాల్లో నల్లమందును అధికారికంగానే సాగు చేస్తున్నారు. అలాంటి ప్రాంతాల నుంచి దొంగచాటుగా ఓపియంను తరలిస్తున్నారు.

# బీహార్‌లో ఎన్‌డీఏ సీట్ల కేటాయింపు

### ఎన్నికల వేళ కీలక ప్రకటన



**టిమీడియా, అక్టోబర్ 12,ఢిల్లీ బ్యూరో:** బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, వివిధ పార్టీల్లో సీట్ల కేటాయింపుపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. తాజాగా ఎన్‌డీఏలో సీట్ల పంపకంపై నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడింది. సీట్ల భాగస్వామ్యం ఖరారు చేసింది. మొత్తం 243 సీట్లపై ఒప్పందం కుదిరింది. జనతాదళ్‌యునైటెడ్ (జేడీయూ) 101 సీట్లు,భారతీయ జనతా పార్టీ (బీజేపీ): 101 సీట్లు,లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్): 29 సీట్లు,హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం): 6 సీట్లు,రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం): 6 సీట్లు. బీజేపీ, జేడీయూలు చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29 స్థానాల్లో బరిలో దిగనుంది. కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం)కు, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుశ్వాహా సారథ్యంలోని రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్ఎల్ఎం)కు ఆరు చొప్పున సీట్లు కేటాయించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర సీనియర్ నాయకులు ఉన్న బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం తర్వాత సీట్ల కేటాయింపు విషయాన్ని కేంద్రమంత్రి, బీజేపీ సీనియర్ నేత ధర్మేంద్ర ప్రధాన్ ఖరారు చేశారు. జేడీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు సామ్రాట్ చౌదరి, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్? కూడా పోస్టులు పెట్టారు. లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) 29 సీట్లలో పోటీ చేయనుంది. కనీసం 15 సీట్లు కావాలని పట్టుబట్టిన జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తానీ అవామ్ మోర్చాకు ఆరు నియోజకవర్గాలు మాత్రమే దక్కాయి. మిగిలిన ఆరు అసెంబ్లీ విభాగాలు రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చాకు వెళ్లాయి. గత కొన్ని రోజులుగా దేశ రాజధానిలో నాయకులంతా ఈ ఒప్పందం స్నేహపూర్వక వాతావరణంలో కుదిరిందని ఏకగ్రీవంగా ప్రకటించారు. అదే సమయంలో ఒప్పందంపై అసంతృప్తిగా ఉన్న జితిన్ రామ్ మాంఝీ సోషల్ మీడియాలో హ్యాండిల్‌లో స్పందించారు. తాను పట్నాకు తిరిగి వస్తున్నారని రాసుకొచ్చారు. చివరి శ్వాస వరకు తాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే ఉంటానని స్పష్టం చేశారు. రెండు సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన కుష్వాహా పార్టీని మినహాయించి, ఎన్?డీఏలోని అన్ని ఇతర నియోజకవర్గాలు 2020 ఎన్నికల్లో వరుసగా వారు పోటీ చేసిన నియోజకవర్గాల సంఖ్య కంటే తక్కువ సీట్లలో పోటీ చేయడానికి అంగీకరించాయి. గత ఎన్నికల్లో జేడీయూ 115 సీట్లలో పోటీ చేసింది. ఆ తర్వాత బీజేపీ 110 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. హిందుస్తానీ అవామ్ మోర్చా ఏడు స్థానాల్లో బరిలో దిగనుంది. అప్పుడు లోక్ జనశక్తి పార్టీకి నాయకత్వం వహిస్తున్న పాస్?వాన్? విడిగా పోటీ చేసి 135 సీట్లలో అభ్యర్థులను నిలబెట్టారు. 2020లో మరో ఎన్?డీఏ భాగస్వామి, మాజీ రాష్ట్ర మంత్రి ముకేశ్ సహానీకి చెందిన వికాస్షీల్ ఇన్సాన్ పార్టీ, ప్రస్తుతం ఇండియా బ్లాక్‌లో ఉంది, నాలుగు సీట్లలో పోటీ చేసింది. 2020లో పార్టీ పేలవమైన ప్రదర్శనను దృష్టిలో ఉంచుకుని జేడీయూ, ఈసారి సింహభాగాన్ని కోరుకోలేదని తెలుస్తోంది. 2020లో పార్టీ 43 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఇది బీజేపీ 74 కంటే చాలా తక్కువ. అయితే పరాజయం ప్రధానంగా పాస్?వాన్? తిరుగుబాటు వల్ల అని ఆరోపణలు ఉన్నాయి. పాస్?వాన్? తిరుగుబాటు బీజేపీ ఆదేశం మేరకు జరిగిందని, దాని ఫలితంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ 17 నెలల స్వల్ప కాలానికి ఎన్?డీఏ నుంచి బయటకు వచ్చారని అప్పట్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి.

# ఓర్వకల్లు నోడ్'కు రూ.వేల కోట్ల పెట్టుబడులు

### ప్రధాని మోదీ రాకతో మరింత ప్రాధాన్యం

**టీ మీడియా, అక్టోబర్12,కర్నూలు :** కర్నూలు జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకుని పలు ప్రాజెక్టులను ప్రతిపాదించడం, వాటి సాకారానికి కేంద్రం సహకరిస్తుండడంతో కర్నూలు జిల్లా ప్రగతిపథంలో పరుగులు పెట్టనుంది. హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక నడవా (హెచ్‌బీఐసీ) పరిధిలో ఓర్వకల్లు నోడ్ అభివృద్ధికి కేంద్రం తొలివిడతగా రూ.1,000 కోట్లు కేటాయించడంతో ఆ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందడానికి మార్గం సుగమమైంది. ప్రధాని మోదీ ఓర్వకల్లు వస్తున్న నేపథ్యంలో రూ.29వేల కోట్ల పైగా పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్న పారిశ్రామిక ప్రాంతాన్ని సందర్శిస్తారని చెబుతున్నారు. రాయలసీమకు ఎకనమిక్ గ్రోత్ కారిడార్ ఏర్పాటు చేయాలని, నెల్లూరు, రాయలసీమ జిల్లాలను ఎకనమిక్ డెవలప్‌మెంట్ రీజియన్‌గా అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. దీంతో ఓర్వకల్లులోని మెగా ఇండస్ట్రియల్ హబ్ ప్రాంతానికి మరింత మహర్దశ పట్టేలా ఉంది. మొత్తం 5,000 ఎకరాల్లో ఓర్వకల్లు నోడ్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తొలిదశలో 2,471 ఎకరాలను పరిశ్రమలకు వీలుగా అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం మొత్తం రూ.2,870.39 కోట్లు వెచ్చిస్తారు. ఇందులో రూ.వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపిస్తుండడంతో పాటు పలు ఒప్పందాలు కూడా జరిగాయి.

### ఈవీ హబ్‌గా కర్నూలు

జపాన్‌కు చెందిన ఇటోయే మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, భారత్‌కు చెందిన హైడ్రస్, బీఎస్ గ్రూప్‌లు కలిపి మొత్తం రూ.14,000 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో 2,000 మందికి ప్రత్యక్షంగా, 12,000 మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. కర్నూలును ఈవీ హబ్‌గా మార్చడానికి వీలుగా 'ఈవీ పార్క్'ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 1200 ఎకరాల్లో ఏర్పాటు కాబోయే ప్రాజెక్టులో మొత్తం రూ.13వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి.



సర్వతోముఖాభివృద్ధి దిశగా ఏపీ: రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సంస్థ రూ.758 కోట్ల పెట్టుబడితో పలు రకాల ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని ఓర్వకల్లులో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ సంస్థ 500 మందికి ఉపాధి కల్పిస్తుంది. మహిళలతో కుటీర పరిశ్రమలను నెలకొల్పి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది, వేలమంది మహిళలకు ఉపాధి కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్న అలీప్ సంస్థ సైతం ఓర్వకల్లులో ఒక రూ.36.25 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఓర్వకల్లులో దాదాపు రూ.6వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ఓ సంస్థ ముందుకొచ్చింది. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి త్వరలో కార్గో, ఎం.ఆర్.ఒ., సిమ్యులేటర్ సేవలనూ ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

### కొత్త రైల్వేలైను ఏర్పాటుకు చర్యలు

విమానాశ్రయ అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. కర్నూలు నుంచి దూపాడు, ఓర్వకల్లు మీదుగా బేతంచెర్లకు కొత్త రైల్వేలైను నిర్మాణానికి రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. ఓర్వకల్లు సమీపంలోని గుట్టపాడులో జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమను 350 ఎకరాల్లో రూ.1600 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేశారు. ఓర్వకల్లు సమీపంలోని కాల్వ గ్రామంలో ఉన్న ఫ్రెష్‌బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను రూ.33 కోట్లతో విస్తరించనున్నారు.

# వాడరేవు తీరంలో విషాదం

- ముగ్గురి మృతి, ఇద్దరు గల్లంతు



**టీ మీడియా, అక్టోబర్12,చీరాల :**
బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు తీరంలో విషాదం నెలకొంది. సముద్రంలో స్నానానికి దిగిన ఐదుగురు అలల తాకిడికి గల్లంతయ్యారు. వారిలో ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. సెలవు రోజుల్లో సరదాగా గడిపేందుకు సందర్శకులు సూర్యలంక బీచ్‌తో పాటు, వాడరేవు సముద్ర తీరానికి వస్తుంటారు. ఈ క్రమంలో అమరావతిలోని విట్ యూనివర్సిటీ నుంచి 10 మంది విద్యార్థులు బృందంగా వాడరేవుకు వచ్చారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన శ్రీ సాకేత్, సాయి మణిదీప్, జీవన్ సాత్విక్‌లు అలల తాకిడికి కొట్టుకుపోయారు. స్థానికంగా ఉన్న మత్స్యకారులు, గజ ఈతగాళ్లు వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గల్లంతైన కాసేపటికి మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మృతదేహాలను చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో విద్యార్థి సోమేష్‌తోపాటు చీరాలకు చెందిన గౌతమ్ సముద్రంలో గల్లంతయ్యారు. వీరి కోసం అగ్నిమాపక, మత్స్యశాఖ అధికారులు డ్రాగన్ లైట్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలిని బాపట్ల ఎస్పీ ఉమామహేశ్వర్ పరిశీలించారు.

**నలుగురు యువకులను కాపాడిన కానిస్టేబుళ్లు :** మరోవైపు మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో ఇద్దరు కానిస్టేబుళ్లు ప్రాణాలకు తెగించి నలుగురు యువకులను ప్రమాదం నుంచి కాపాడారు. కపిలేశ్వరానికి చెందిన యువకులు అబ్దుల్ అసిఫ్, ఎస్‌కే ఆర్షాద్, ఎస్‌కే సికిందర్, షరీఫ్ సరదాగా గడిపేందుకు ఆదివారం ఉదయం మంగినపూడి బీచ్?కు వచ్చారు. సముద్ర స్నానానికి దిగిన నలుగురు యువకులు అలల ఉద్ధృతికి కొట్టుకుపోయారు. గమనించిన కానిస్టేబుళ్లు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా లోపలికి వెళ్లి వారిని క్షేమంగా ఒడ్డుకు తీసుకొచ్చారు.

# శ్రీరాంసాగర్ రెండో దశకు దామోదర్ రెడ్డి పేరు

- 24 గంటల్లోగా జీవో జారీ
- దామన్న కుటుంబానికి అండగా ఉంటాం
- సంతాప సభలో సీఎం రేవంత్ రెడ్డి

**టీ మీడియా, అక్టోబర్12, నల్లగొండ :** శ్రీరాం సాగర్ రెండో దశకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు 24గంటల్లోగా దీనికి సంబంధించిన జీవో కూడా జారీ చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో ఆదివారం జరిగిన దామోదర్ రెడ్డి సంతాప సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరు అయి ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అంతకంటే ముందు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ఎస్సారెస్పీ-2 దశకు దామోదర్ రెడ్డి పేరు పెట్టడాన్ని రాజకీయ పార్టీలు కూడా అభ్యంతరం తెలుపవని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సారెస్పీ 2 దశకు దామోదర్ రెడ్డి పేరు పెట్టడమే ఆయనకు ఇచ్చిన అసలైన నివాళులు అంటూ ఆయన చెప్పుకొచ్చారు. అంతేకాదు ఆయనత్యాగాలు గౌరవాన్ని గుర్తిస్తాయని తెలిపారు. దామోదరరెడ్డి



మృతి చెందడం ఎంతో బాధాకరమని సంతాపాన్నిప్రకటించారు. తన జీవితమంతా ప్రజలకే అర్పించాడని పేర్కొన్నారు. దామోదర్ రెడ్డి కుటుంబానికి గాంధీ కుటుంబం అండగా ఉందని చెప్పమని సోనియా గాంధీ రాహుల్ గాంధీ చెప్పినట్లు పేర్కొన్నారు ఇప్పటికే రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డికి రాహుల్ గాంధీ ప్రత్యేకంగా లేఖ రాశారని గుర్తు చేశారుముఖ్యంగా ఒకసారి రాజకీయాల్లో ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వారు ఆస్తులు కూడా పెట్టుకుంటే 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసిన దామోదర్ రెడ్డి తన వారసత్వం నుండి వచ్చిన ఆస్తులను ప్రజల కోసం కరగదీశాడని పేర్కొన్నారు. కక్షలు, కార్పన్యాలు, హత్య రాజకీయాలతో అట్టుడికి పోయిన తుంగతుర్తి ప్రాంతంలో వాటన్నింటినీ ఎదుర్కొంటూ కాంగ్రెస్ జెండాను నిలబెట్టాడని గుర్తు చేశారు. ఒకవైపు క్యాడర్ ను కాపాడుకుంటూనే మరోవైపు నీళ్లు లేక ఎడారిల మారిపోతూ ఫ్లోరైడ్ పట్టిపీడిస్తున్న తరుణంలో దామోదర్ రెడ్డి తుంగతుర్తి ప్రాంతానికి ఎస్సారెస్పీ నీళ్లు తేవడానికి ఉద్యమాలు సాగించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి అండ దండగ నిలిచిన దామోదర్ రెడ్డి ఆశయాలను సాగిస్తూనే కుటుంబానికి అండదండగా ఉంటామని భవిష్యత్తులో సర్వోత్తమ్ రెడ్డికి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వీహెచ్తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, నేతలు ఎస్సారెస్పీ-2కి దామోదర్ రెడ్డి పేరు పెట్టాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ఒక వినతిపత్రం కూడా అందజేశారు.

# ప్రారంభోత్సవానికి ఇందిరమ్మ ఇళ్లు

- ఏర్పాట్లపై దృష్టిపెట్టిన అధికారులు
- స్థానిక ఎన్నికలు నిలిచిపోవడంతో నిర్మాణాలపై దృష్టి

**టీ మీడియా, అక్టోబర్12, ఉమ్మడి మెదక్ బ్యూరో**



: ఉమ్మడి మెదక్? జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నాయి. ఫస్ట్? పేజ్?లో ఎంపికైన గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయిన వాటి గృహ ప్రవేశాలకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. దీపావళి నాటికి మండలానికి ఒక ఇంటి చొప్పున ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

**కలెక్టర్ హైమావతి సమీక్ష**

స్థానిక ఎన్నికల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం వీటిపై దృష్టి సారించలేదు. ఇప్పుడు ఆ ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోవడంతో ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి సంబంధించి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 10వ తేదీన జిల్లా కలెక్టర్ హైమావతి హుస్నాబాద్ పురపాలక కార్యాలయంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల అధికారులతో వీటికి సంబంధించి సమీక్షించారు. మంజూరైన అన్ని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, మధ్యలో ఉన్న వాటి పనులు పూర్తయ్యేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు. ఈ మేరకు నిర్మాణాలు వేగవంతం అయ్యేవిధంగా అధికారులు చర్యలు చేపట్టారు. గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించేవిధంగా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

**తోటపల్లిలో ఒకటి**

ఇప్పటికే హుస్నాబాద్ మండలంలోని తోటపల్లిలో ఒక ఇందిరమ్మ ఇంటిని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 7వ తేదీ వరకు 576 గృహాలకు స్లాబ్? వేసే ప్రక్రియ పూర్తయ్యింది. వాటిలో 14 ఇళ్ల పనులు పూర్తయ్యాయి. స్లాబు పడినప్పటికీ మిగతా వాటికి ప్లాస్టరింగ్ పని జరుగుతోంది. వారితో అధికారులు ఎప్పటికప్పుడు మాట్లాడితేనే త్వరగా పూర్తయ్యేందుకు అవకాశం ఉంటుంది.

**చెల్లింపు జాప్యానికి చెక్**

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి బిల్లుల చెల్లింపుల్లో కొన్ని జిల్లాల్లో జాప్యం జరుగుతోంది. సాంకేతిక సమస్యలు పలుచోట్ల తలెత్తడంతో వాటి పరిష్కారానికి గృహ నిర్మాణ శాఖ ప్రధాన కార్యాలయానికి స్థానిక అధికారులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని చోట్ల లబ్ధిదారులు ఒక ప్రదేశాన్ని చూపించి మరో ప్రదేశంలో నిర్మాణాలను చేపడుతున్నారని, మరికొన్ని చోట్ల జియో కో-ఆర్డినేట్‌లో సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు చెబుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో కొత్త ఐచ్ఛికాన్ని తాజాగా ప్రవేశపెట్టారు.

**ఏం చేయాలంటే?**

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించేందుకు, అవినీతికి అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుంది. తమ ఇంటి చిత్రాన్ని లబ్ధిదారులే స్వయంగా యాప్‌లో అప్‌లోడ్ చేసే సౌకర్యాన్ని కల్పించింది. ఆ తర్వాత వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేసిన అనంతరం ఓకే చెబుతారు. లబ్ధిదారులు తమ తమ స్మార్ట్‌ఫోన్‌లో ఇందిరమ్మ ఇళ్ల యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

**యాప్?లో ఇలా చేయాలి**

యూజర్ లాగిన్‌కు వెళ్లి మీరు పూర్తి పేరు, ఫోన్ నంబరు, గ్రామం తదితర పూర్తి వివరాలను నమోదు చేయాలి. ఇంటి నిర్మాణం ఏ దశలో ఉందో దాన్ని ఫొటో తీసి యాప్?లో వివరంగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత కోరిన వివరాలను పూర్తిచేస్తే ప్రక్రియ పూర్తవుతుంది. లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి సంబంధించి వాస్తవ చిత్రాలనే అప్‌లోడ్ చేయాలి. లేదంటే క్షేత్రస్థాయి అధికారుల పరిశీలనలో విషయం బయటపడుతుందని గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు సూచించారు.

# శ్రమకు తగ్గ గౌరవ వేతనం ఇవ్వాలి

**రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**




**టీ మీడియా, అక్టోబర్12, అచ్చంపేట:** గిరిజన ఆశ్రమ పాఠశాల వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, శ్రమకు తగ్గ గౌరవ వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో టీఎన్జీఓ భవనంలో తెలంగాణ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మూడావత్ శంకర్ నాయక్, డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు భరత్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓం ప్రకాష్, కే ఎన్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు జర్పుల శివ ప్రచండ, డీటీఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామస్వామి, సిఐటియు టౌన్ ప్రెసిడెంట్ రాములు, పౌర హక్కుల సంఘం జిల్లా నేతలు వెంకటేష్, బీఎస్పీ నియోజకవర్గ నాయకులు కృపానందం, తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ కార్మికులు నేటికీ 31 రోజుల నుండి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నప్పటికీ వారి సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న వర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకోవడం సరైనది కాదన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం వినూత్నమైన పద్ధతిలో ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉద్యమం ఉధృతం చేయాలని పోరాటాల ద్వారానే తమ హక్కులు సాధ్యం అవుతాయని సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఉద్యమం కొనసాగించాలని పిలుపునిచ్చారు. గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 64 జీవో తీసుకొస్తే ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జీతాలకు కోతలు విధించే జీవోను అమలు చేయడానికి తీవ్రంగా వ్యతిరేకించారు. జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారమే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డైలీ వెజ్ వర్కర్స్ 35 సంవత్సరాలుగా ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో పనిచేస్తున్నారని వారికి టైం స్కేల్ అమలు చేస్తూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. డైలీ వేజ్ వర్కర్లు సమ్మె చేస్తే రోజుకు 1000 రూపాయలు ఇచ్చి హాస్టల్లో పనిచేయించుకుంటున్నా ప్రభుత్వ అధికారులు వీరికి వేతనాలు పెంచడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పర్వతాలు, ప్రజా సంఘాల నాయకులు కార్మిక సంఘాల నాయకులు అంబేద్కర్ రిస్టులు పౌర హక్కుల సంఘం నాయకులు ఉన్నారురహక్కుల సంగం నాయకులు ఉన్నారు.

# వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

**సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ వెంకటస్వామి**




**టీ మీడియా, అక్టోబర్12,జోగులాంబ గద్వాల:** అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఏ. వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వస్తు, సేవల ఎగుమతి దిగుమతులలో, వాటిని సాధారణ ప్రజలకు అందజేయడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న హమాలీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు అందించే సేవల వల్లే ప్రభుత్వాల పాలన విధానాలు సక్రమంగా సాగుతున్నాయని, ప్రజలకు అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉంటున్నాయని గుర్తు చేశారు. కార్మికుల ఆదాయాలు పెరిగితేనే, వస్తు సేవల కొనుగోలు పెరిగి ఉత్పత్తి ప్రక్రియ వేగవంతం అవుతుందని కానీ ప్రభుత్వాలు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్మికుల యొక్క ఆదాయాల పెరగకపోవడం కూడా దేశంలో పెరుగుతున్న ఆర్థిక మాంద్యానికి ప్రధాన కారణం అని అన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం సంపదను మరింత కేంద్రీకరించే చర్యలకు పాల్పడుతుండడం దారుణం అన్నారు. కార్మిక వర్గానికి ఉపాధి పెరిగితేనే ఆదాయాల పెరుగుతాయని, తద్వారా కొనుగోలు శక్తి పెరిగి, ఉత్పత్తి ప్రక్రియ వేగవంతం అవుతుందని అన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు ఉపాధికి భద్రత,కనీస వేతనాలు అమలు,పని ప్రదేశాలలో సౌకర్యాలు,పియఫ్ ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు అమలు చేయకపోగ దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక వర్గ చట్టాలకు సవరణ చేస్తూ కార్మిక హక్కులను కాల రాస్తున్నదని విమర్శించారు. హమాలీ కార్మికులకు పని ప్రదేశాలలో ప్రత్యేక అడ్డాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యాత హమాలీ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వాలు వచ్చినా పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు తీసుకుంటూ, కార్మికులను శ్రమదోపిడికి గురి చేస్తున్నాయని విమర్శించారు. కార్మికులు సంఘటితంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ,హమాలీ సంఘం అధ్యక్ష కార్యదర్శులు రంగన్న, బాలకృష్ణ కార్మికులు మజ్జిగ ఆంజనేయులు, బలరాం,లక్ష్మన్న,రామకృష్ణ,విష్ణు,వీరేష్ బాబన్న,భాస్కర్,నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ ఓ రాజకీయ కుట్ర

- దళితుల మధ్య రిజర్వేషన్ల పేరుతో వర్గపోరు
- మాల మహానాడు అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

**టీ మీడియా, టి మీడియా, అక్టోబర్ 12, ఖమ్మం :**




ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై దేశ వ్యాప్త చరిత్రలోనే అతి పెద్ద రాజకీయ కుట్ర జరిగిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అండ్ రాక్స్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. ఆదివారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దళితులకు రిజర్వేషన్ పేరుతో పడేసే ఎంగిలి మెతుకుల్లోనేనా వర్గీకరణ పేరుతో వాటాలు, సామాజిక న్యాయం ? మిగతా వాటికి అక్కర్లేదా? రేవంత్ రెడ్డి, చంద్రబాబు అనుభవించే ముఖ్యమంత్రి పదవికి సామాజిక న్యాయం అక్కర్లేదా..? వారు జనాభా దామాషా ప్రకారం ముఖ్యమంత్రి పదవులను ఇచ్చేస్తారు అని ప్రశ్నించారు..? ఎస్సీ వర్గీకరణను శాంపుల్ గా పంజాబ్, హర్యానాలో మొట్టమొదటిగా ఈ దేశంలో చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే. బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే దీన్ని ప్రధాని మోడీ దేశం మొత్తం చేశాడని విమర్శించారు. శాస్త్రీయతలేని రాష్ట్ర జనాభా లెక్కలతో ఎస్సీ రిజర్వేషన్ వల్ల వందలో నలుగురికే లాభం జరుగుతోందని, ఈ వందలో నలుగురికి ఇచ్చే ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు మోడీ జీ అని నిలదీశారు. అలాగే ఈ నాలుగు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ ఉప-కులాలకు ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు..? ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ, ఆంధ్ర ముఖ్యమంత్రులు రేవంత్, చంద్రబాబు మాల సామాజిక వర్గంపై కుట్రపన్ని అణిచి వేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయినవి కదా, ఇక చేసేదేముందని అనుకోకండి, ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందేనన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తూ ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం, ఘోర అన్యాయం అన్నారు. చెంచా గిరికి అలవాటు పడ్డ మాల నాయకులు, రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప, జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాల న్నారు. రిజర్వేషన్లు లాభాలు పొందిన మాల ఉద్యోగులరా.. మాల జాతిని తొక్కేస్తూ ఉన్నారు. ఇకనైనా కళ్ళు తెరిచి బయటకు రండి, ఈ పోరాటానికి మద్దతు ఇవ్వండని గొంతెత్తారు. తెలుగు రాష్ట్రాల్లో మాల సామాజికవర్గం పూర్తిగా ఉనికిని కోల్పోయామని, శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కామ ప్రభాకర్ రావు, బల్లెం లక్ష్మణ్, మిరియాల బాలశౌరి, తోట దుర్గాప్రసాద్, కనికెళ్ళ నాని, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కో ఓటీపీకి రూ.1000, రూ.2000

## జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు లింకు, దరఖాస్తులు లెక్కగట్టి వసూలు

**టిమీడియా, అక్టోబర్ 12, హైదరాబాద్ బ్యూరో:** లంచం ఇస్తేగానీ హైదరాబాద్? నగరంలోని కొన్ని ప్రాంతాల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఆమోదం పొందట్లేదు. కొంతమంది అధికారులు దరఖాస్తుకు రూ.1000, రూ.2000 వసూలు చేస్తున్నారు. వారికి కంప్యూటర్ ఆపరేటర్లు మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. కేంద్ర కార్యాలయం పర్యవేక్షణ లేకపోవడంతో సర్కిళ్ల స్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు రెచ్చిపోయి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

**డబ్బులిస్తేనే ఆమోదం**

జనన, మరణ ధ్రువీకరణపత్రాల(బర్త్, డెత్?) దరఖాస్తులను ఆమోదించే అధికారం సహాయ వైద్యాధికారులు, సహాయ మున్సిపల్ కమిషనర్లకు ఉంటుంది. తప్పుడు పత్రాల జారీకి అధికారులను బాధ్యులు చేయాలనే ఉద్దేశంతో సదరు అధికారి నంబరుకు వచ్చే ఓటీపీతో దరఖాస్తు ఆమోదాన్ని ముడిపెట్టారు. ఆ నిబంధనను కొంతమంది అధికారులు దుర్వినియోగం చేస్తున్నారు. ఒక్కో ఓటీపీకి(వన్? టైం పాస్?వర్డ్?) రూ.1,000 నుంచి రూ.2,000 ఇవ్వాలని అప్పుడే ఓటీపీ చెబుతామని కంప్యూటర్ ఆపరేటర్లకు షరతు పెట్టారు.

**ఇవిగో ఉదాహరణలు**

జులై 27వ తేదీన పిల్లాడికి పేరు పెట్టేందుకు దరఖాస్తు నంబరు బీసీఎన్‌సీ07250 25319తో ఓ వ్యక్తి మీసేవా సెంటర్? ద్వారా చేసుకున్న దరఖాస్తును అధికారులు ఇప్పటికీ ఆమోదించలేదు.

ఆగస్టు 20వ తేదీన తన కుమారుడికి పేరు పెట్టడం కోసం బేగంపేట్‌కు చెందిన వ్యక్తి దరఖాస్తు నెంబరు సీఎన్ఐ022502429108తో చేసుకున్న దరఖాస్తును అధికారి ఇంతవరకు ఆమోదించలేదు. ఆన్‌లైన్‌లో పుట్టిన తేదీని పరిశీలించుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ సరైన పత్రాలతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఆ అధికారి దరఖాస్తును అటకెక్కించడం గమనార్హం.



**కావాలనే తప్పుగా నమోదు చేసి**

నగరంలోని 30 సర్కిళ్లలో కలిపి 5వేల అప్లికేషన్లు పెండింగులో ఉన్నాయి. అందులో 2 నెలలకుపైగా ఆమోదం పొందనివే 3వేలు ఉండటం గమనార్హం. బాధితుల్లో మెజార్టీ అమాయకులు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేయించుకున్న పేదలకు మరిన్ని కష్టాలు ఎదురవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగా ఆయా ఆస్పత్రుల్లోని సిబ్బంది తల్లిదండ్రుల పేర్లను తప్పుగా నమోదు చేస్తున్నారు. మీసేవా సెంటర్? నిర్వాహకులూ అలాగే జనన ధ్రువీకరణపత్రాలు ఇస్తున్నారు. పిల్లలకు ఆధార్ కార్డు తీసుకునేటప్పుడు, పాఠశాలల్లో అడ్మిషన్ల సమయంలోనే సమస్య గురించి తెలుస్తోంది. హడావుడిగా మీసేవా సెంటర్?కు వెళ్లి, అఫిడవిట్, ఇతరత్రా పత్రాలు సమర్పించి అధికారులకు లంచాలిచ్చి సర్టిఫికెట్లలోని తప్పులు దిద్దుకుంటున్నారు. పేర్ల సవరణకు వచ్చే అర్జీల్లో 99శాతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన పిల్లల సర్టిఫికెట్లు ఉండటమే అందుకు నిదర్శనం.

## లంచగొండి అధికారులపై ఏసీబీ నిఘా

ఇటీవల కాలంలో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అరెస్టు చేసిన పలువురు లంచగొండి అధికారులు లంచాల సొమ్ముతో సంపాదించిన ఆస్తులు చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఒక్కొక్కరి ఆస్తుల విలువ రూ.100 కోట్లు ఉండడం అడ్డూ అదుపు లేని వారి అవినీతికి పరాకాష్టగా నిలుస్తోంది. పట్టుబడుతున్న వారు కొంతమందే. ప్రభుత్వ శాఖల్లో తిష్ఠ వేసుకున్న అవినీతి అనకొండలు ఇంకా ఎందరో ఉన్నారు. ఈ నేపథ్యంలో అవినీతి అధికారులు, సిబ్బంది వ్యవహారాన్ని సీరియస్?గా పరిగణిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వరుస దాడులు చేయిస్తూ వారిని కటకటాల వెనక్కి పంపిస్తోంది. ఏసీబీకి పట్టుబడుతున్న కొందరు ప్రభుత్వ అధికారుల ఆస్తులను చూస్తే వీరు వెలగబెడుతున్నది నిజంగా ప్రభుత్వ ఉద్యోగమా లేక కార్పొరేట్ కంపెనీలను నడుపుతున్నారా? అనే డౌట్? రాక మానదు. అంతలా ఉంటున్నాయి వీరి ఆస్తిపాస్తులు. లంచావతారులపై ఫిర్యాదుల ఆధారంగా నిఘా పెడుతున్న అవినీతి నిరోధకశాఖ వారిని వలపన్ని పట్టుకుంటోంది.

# విదేశీ పౌరసత్వాల కోసం క్యూ

- విద్యార్థులు, వ్యాపారుల పెట్టుబడి పెట్టే వారికి
- భారతీయులను ఆకట్టుకున్న ఆస్ట్రేలియా, యూఏఈ, పోర్చుగల్

**టిమీడియా, అక్టోబర్ 12,ఢిల్లీ బ్యూరో:**




భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ప్రగతిబాటలో ఉంది. ఈ తరుణంలో చాలా మంది భారతీయులు స్వదేశానికే జై కొడుతున్నారు. అయితే కొందరు 'హై నెట్‌వర్త్ వ్యక్తులు బిలియనీర్లు, విద్యార్థులు, పరిశోధకులు మాత్రం ప్రత్యామ్నాయాలు, అభివృద్ధి అవకాశాలు, కెరీర్ పురోగతి కోసం విదేశాల వైపు ఆశగా చూస్తున్నారు. పౌరసత్వం మంజూరుకు పలు దేశాలు కఠినమైన ప్రాసెస్‌ను పెట్టినా, భారీ పెట్టుబడుల షరతులు విధించినా లెక్క చేయకుండా ఎంతోమంది భారతీయ హెచ్ఎన్ఐలు అప్లై చేసుకుంటున్నారు. ఇంతకీ ఏయే దేశాల పౌరసత్వంపై వారు ఎక్కువ ఆసక్తిని చూపిస్తున్నారు? పెట్టుబడి ప్రాతిపదికన పౌరసత్వాన్ని ఏయే దేశాలు ఇస్తున్నాయి? పౌరసత్వం మంజూరుకు కఠినమైన రూల్స్‌ను అమలుచేస్తున్న దేశాలేవి? ఈ కథనంలో తెలుసుకుందాం.

**బిలియనీర్లు, విద్యార్థులు, వ్యాపారుల హంట్**

బిలియనీర్లకు సంపదను, వ్యాపారాన్ని పెంచుకోవాలనే లక్ష్యం ఉంటుంది. వీలైనంత ఎక్కువ ట్యాక్స్‌ను ఆదా చేసుకోవాలని వారు భావిస్తారు. పౌరసత్వంతో పాటు ఈ ప్రయోజనాలన్నీ ఇచ్చే దేశాల కోసం సంపన్నులు అన్వేషిస్తున్నారు. ఉన్నత విద్యను పూర్తి చేసిన వెంటనే ఉద్యోగంతో పాటు పౌరసత్వం ఇచ్చే దేశాల కోసం విద్యార్థులు వెతుకుతున్నారు. కేవలం సౌకర్యవంతమైన, విలాసవంతమైన జీవితం కోసం ఎంతోమంది సంపన్నులు, వ్యాపారులు పలు దేశాల పౌరసత్వాన్ని కోరుకుంటున్నారు. భారత సర్కారు ఒకే వ్యక్తికి రెండు పౌరసత్వాలను మంజూరు చేయదు. అందుకే 'హై నెట్‌వర్త్ వ్యక్తులు' భారత పౌరసత్వాన్ని వదులుకొని, తమకు నచ్చిన దేశాలకు వెళ్లిపోయేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈక్రమంలో అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, ఇటలీ, పోర్చుగల్, గ్రీస్, స్పెయిన్, మాల్టా, గల్ఫ్ దేశాలకు హై ప్రయారిటీ ఇస్తున్నారు. గత ఐదేళ్లుగా ఇదే ట్రెండ్ కంటిన్యూ అవుతోంది. ఈ విషయం సాక్షాత్తూ భారత ప్రభుత్వ అధికారిక నివేదికల్లో వెల్లడైంది. సులభంగా పౌరసత్వాన్ని మంజూరు చేస్తున్నందు వల్లే ఈ దేశాలకు వెళ్లిపోయేందుకు భారతీయ హెచ్ఎన్ఐలు మొగ్గు చూపుతున్నారు.

**పెట్టుబడి ఇచ్చుకో- పౌరసత్వం పుచ్చుకో**

సాధారణంగా ఏదైనా దేశ పౌరసత్వం కావాలంటే అక్కడ కనీసం ఐదేళ్ల నుంచి 10 ఏళ్ల పాటు నివసించాలి. అయితే పలు దేశాలు పెట్టుబడులు పెట్టే వాళ్లకు కొన్ని నెలల్లోనే పౌరసత్వాన్ని మంజూరు చేస్తున్నాయి. ఈ జాబితాలోకి సెయింట్ కిట్స్ అండ్ నెవిస్, యాంటిగ్వా, డొమినికా, మాల్టా లాంటి దేశాలు వస్తాయి. సిటిజెన్‌షిప్ బై ఇన్వెస్ట్‌మెంట్ స్కీంను ఈ దేశాలు అమలు చేస్తున్నాయి. పెట్టుబడి లేదా విరాళం ఇచ్చిన వారికి పౌరసత్వం కేటాయిస్తున్నాయి. పోర్చుగల్, గ్రీస్, స్పెయిన్, మాల్టా, యూఏఈ లాంటి దేశాలు గోల్డెన్ వీసాలను ఇస్తున్నాయి. ఆయా దేశాల్లోని రియల్ ఎస్టేట్, ఇతరత్రా ఫండ్‌లలో నిర్దిష్ట పెట్టుబడి పెడితే కొన్నేళ్ల పాటు నివాస అనుమతులు మంజూరు చేస్తారు. తదుపరిగా దేశ పౌరసత్వాన్ని కేటాయిస్తారు. కెనడా, ఆస్ట్రేలియా, యూకేల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే భారతీయులకు వర్క్ పర్మిట్లు ఈజీగా మంజూరు అవుతున్నాయి. అనంతరం వారికి పర్మినెంట్ రెసిడెన్సీని, చివరగా పాస్‌పోర్టును మంజూరు చేస్తున్నారు. పలు దేశాల పౌరసత్వం మంజూరైతే వీసా లేకుండానే దాదాపు 100 నుంచి 150 దేశాలకు రాకపోకలు సాగించే అవకాశం లభిస్తుంది.

**పౌరసత్వాన్ని ఎలా కొనాలి..?**

యూఏఈ దేశం సరికొత్త నామినేషన్ ఆధారిత వీసా పాలసీని తీసుకొచ్చింది. దీని ద్వారా భారతీయులు రూ.25 లక్షలను చెల్లించి యూఏఈలో జీవితకాల నివాస అనుమతి కోసం దరఖాస్తు చేయొచ్చు. తుర్కియే (టర్కీ) పౌరసత్వం కోసం ఆ దేశ రియల్ ఎస్టేట్‌లో రూ.3.54 కోట్ల పెట్టుబడి పెట్టాలి. లేదంటే అక్కడి బాండ్లు, ఫండ్లు, డిపాజిట్లలో రూ.4.50 కోట్ల పెట్టుబడిని పెట్టాల్సి ఉంటుంది. ఈ పెట్టుబడిని కనీసం మూడేళ్లు కంటిన్యూ చేస్తేనే పౌరసత్వం కోసం అర్హత లభిస్తుంది. దాదాపు 6 నుంచి 8 నెలల్లో పౌరసత్వం మంజూరయ్యే అవకాశాలు ఉంటాయి. గ్రెనడా పౌరసత్వం కోసం ఆ దేశ నేషనల్ ట్రాన్స్‌ఫామేషన్ ఫండ్‌కు రూ.2 కోట్ల విరాళం ఇవ్వాలి. లేదంటే అక్కడి ప్రభుత్వం ఆమోదించిన రియల్ ఎస్టేట్‌లో రూ.2.39 కోట్ల పెట్టుబడి పెట్టాలి. పౌరసత్వం మంజూరుకు 4 నుంచి 6 నెలల టైం పడుతుంది. సెయింట్ లూసియా పౌరసత్వం కోసం ఆ దేశ రియల్ ఎస్టేట్, బాండ్లలో రూ.2.12 కోట్ల పెట్టుబడి పెట్టాలి. పౌరసత్వం మంజూరుకు 6 నుంచి 12 నెలల టైం పడుతుంది. యాంటిగ్వా బార్బుడా పౌరసత్వం కోసం ఆ దేశ రియల్ ఎస్టేట్ సహా పలు రంగాల్లో రూ.2 కోట్ల నుంచి రూ.2.60 కోట్ల దాకా పెట్టుబడి పెట్టాలి. పౌరసత్వం మంజూరుకు 3 నుంచి 6 నెలల టైం పడుతుంది. వనౌతు పౌరసత్వం కోసం రూ.1.15 కోట్లను అక్కడి ప్రభుత్వానికి అధికారికంగా విరాళంగా ఇవ్వాల్సి ఉంటుంది. లేదంటే అక్కడి రియల్ ఎస్టేట్‌లో ఇంకా పెద్ద మొత్తాన్ని పెట్టుబడి పెట్టాలి. విరాళం ఇచ్చే వారికి 2 నుంచి 3 నెలల్లోపే పౌరసత్వం మంజూరవుతుంది. మాల్టా పౌరసత్వం కోసం రూ.7.25 కోట్లను ఆ దేశంలో పెట్టుబడి పెట్టాలి. అక్కడ ఏదైనా ఆస్తిని కొనాలి. లేదంటే ప్రాపర్టీని అద్దెకు తీసుకోవాలి. తొలుత కొన్నేళ్ల కోసం నివాస అనుమతిని మంజూరు చేస్తారు. శాశ్వత పౌరసత్వం లభించాలంటే 12 నుంచి 36 నెలల పాటు వేచిచూడాల్సిందే.

# పనిచేసే నాయకులకే ప్రాధాన్యత

## ఏఐసీసీ పరిశీలకులు దేబాసిన్ పట్నాయక్



**టీ మీడియా, అక్టోబర్12,పాలకుర్తి:** ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకులకే కాంగ్రెస్ లో ప్రాధాన్యత ఉంటుందని ఏఐసీసీ పరిశీలకులు దేబాసిన్ పట్నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సంఘటన సృజన్ అభియాన్ తెలంగాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిసిసి పరిశీలకులు, ఎమ్మెల్యే శంకర్, ఎండి అవేజ్, శ్రీకాంత్ యాదవ్, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డితో కలిసి దేబాసిన్ పట్నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా అధ్యక్షుల ఎంపిక సమావేశాలను నిర్వహిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి దరఖాస్తు చేసుకోవడంతో పాలకుర్తి నియోజకవర్గం లోని కార్యకర్తలతో అభిప్రాయాలను సేకరించామని తెలిపారు. ప్రజల కోసం, ప్రజా సమస్యల కోసం పనిచేసే ఝాన్సీ రెడ్డిని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించాలని కార్యకర్తలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారని తెలిపారు. ప్రజల మధ్య నుండి, ప్రజా సమస్యలపై అవగాహన కలిగి ఉన్న నాయకులను నియమించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులు చేసుకున్న వారి పేర్లను పరిశీలనకు ఏఐసీసీకి పంపుతామని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎన్నికతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రియస్వామ్యం మరింత బలపడుతుందని తెలిపారు. నిజమైన ప్రజాస్వామ్యానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల అభిప్రాయం, అంగీకారంతోనే జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షు ఎంపిక చేస్తామని తెలిపారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంతో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుల దరఖాస్తు ఫారాన్ని ఆవిష్కరించారు. ప్రజల కోసం పనిచేసే నాయకులకే పదవులు ఇవ్వాలని కార్యకర్తలు పరిశీలకులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి, టీపీసీసీ మెంబర్ డాక్టర్ లాకావత్ లక్ష్మీనారాయణ నాయక్, ఐలమ్మ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లావుడియా మంజుల భాస్కర్ నాయక్, తొర్రూరు సొసైటీ చైర్మన్ గోనె మైసిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి గౌడ్, ధారావత్ సురేష్ నాయక్, నల్ల శ్రీరామ్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, పాలకుర్తి సొసైటీ మాజీ చైర్మన్లు వీరమనేని యాకాంతరావు, అడ్డూరి రవీందర్రావు, దేవస్థానం మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తిలతో పాటు జిల్లా నాయకులు బొమ్మగాని భాస్కర్ గౌడ్, కమ్మగాని నాగన్న గౌడ్, పెనుగొండ రమేష్, మొలుగూరి యాకయ్య గౌడ్, నలమాస రమేష్ గౌడ్, అనుబంధ సంఘాల మండల అధ్యక్షులు లావుడియా భాస్కర్ నాయక్, బండిపెల్లి మనమ్మ, మాదాసు హరీష్ గౌడ్, గాదపాక భాస్కర్, ఐలేష్ లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఝాన్సీ రెడ్డి కె కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలి**

ప్రజాసేవలో ముందుండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, నాయకులను, కార్యకర్తలను సమన్వయంతో పని చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్న టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డికే జిల్లా కాంగ్రెస్ పార్టీ పదవి ఇవ్వాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష అభ్యర్థుల అభిప్రాయ సేకరణకు హాజరైన పరిశీలకులకు తమ అభిప్రాయాలను వెళ్లబుచ్చారు. ఝాన్సీ రెడ్డికి జిల్లా కాంగ్రెస్ పార్టీ పగ్గాలు అప్పగిస్తే క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ పటిష్టమవుతుందని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఝాన్సీ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఏఐసీసీకి పంపించాలని సూచించారు.